క్లుప్తంగా

పలువురిని పరామర్శించిన పీవీఎల్

పాలకోడేరు: పాలకోడేరు గ్రామంలో వార్డు సభ్యురాలు ఇళ్ల సుభద్ర భర్త శ్రీను ఇటీవల మృతి చెందడంతో శనివారం ఆమెను డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. గరగపర్రు గ్రామంలో ఇటీవల ఎంపీటీసీ షేక్ పాపా సాహెబ్ (శంకరం) అల్లుడు ఇటీవల మృతి చెందారు..శనివారం డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు గరగపర్రులోని ఎంపీటీసీ పాపా సాహెబ్ శంకరం ఇంటికి వెళ్లి పరామర్శించారు.ఈయన వెంట కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, గొట్టుముక్కల గోపాలకృష్ణంరాజు, దెందుకూరి వెంకటరాజు తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా మండల పరిషత్ సమావేశం

వీరవాసరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని అధ్యక్షతన నిర్వహించారు. మండల స్థాయి అధికారులతో ప్రత్యేక సమీక్షలు చేపట్టారు. మండలంలోని ప్రజా సమస్యలపై అధికారులు తక్షణం స్పందించాలని వారు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గుండా జయ ప్రకాష్ నాయుడు, ఎంపీడీఓ జ్యోతి, సూపరింటెండెంట్ ఉమామహేశ్వరరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అద్దాల శ్రీరామ్ చంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై తక్షణం స్పందించాలి

వీరవాసరం: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజలందరికీ ప్రజా సమస్యల పట్ల తక్షణం స్పందించాలని భీమవరం రూరల్ సిహెచ్ నాగప్రసాద్ తెలిపారు. వీరవాసం పోలీస్ స్టేషన్లో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరిని గౌరవంగా స్నేహభావంతో పలకరించాలన్నారు .అసాంఘిక కార్యక్రమాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వీరవాసరం ఎస్సై పి.రమేష్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఉండి: మండలం ఎన్నార్పీ అగ్రహారంలో జాతీయ రహదారిని ఆనుకుని చంద్రకాంత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జిల్లా బీసీ సంఘాధ్యక్షుడు సూరవరపు వెంకటాచార్యులు శనివారం ప్రారంభించారు. వేసవి ఎండలు మండిపోతున్న సమయంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులకు అభినందనలు తెలుపుతున్నా నన్నారు. అలాగే సుమారు 10 వేల మందికి డెంగ్యూ మందులు ఉచితంగా పంపిణీ చేసిన నిర్వాహకులు మరిన్ని కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు సేవలందించాలని కోరుకుంటున్నట్లు వెంకటాచార్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు పోతురాజు, కేఎస్‌సీకే పృథ్వీ, శివప్రసాద్, కే వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే రాష్ట్రాభివృద్ధి

భీమవరం అర్బన్: విద్యతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాడు–నేడు పథకం ద్వారా సర్కారు పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకంటే ధీటుగా అభివృద్ధి చేస్తున్నారని సర్పంచ్ రాట్నాల రామకృష్ణ స్వామి అన్నారు. భీమవరం మండలంలోని కొమరాడ గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాట్నాల రామకృష్ణ స్వామి మాట్లాడుతూ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నియోజకవర్గంలో పాఠశాలలకు నాడు–నేడు పథకం ద్వారా రూ. 21 కోట్లతో అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బేతాళ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కిక్కిసకు నిప్పంటుకోవడంతో ఎగసిన మంటలు

భీమవరం అర్బన్: మండలంలోని దొంగపిండి గ్రామంలో శనివారం మధ్యాహ్నం వృద్ధుడు చుట్ట అంటించుకుని అగ్గిపుల్ల కిక్కిసపై వేయడంతో ప్రమాదవశాత్తూ అగ్నికీలలు ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. సమీపంలో ఉన్న నివాసాల వైపు కిక్కిసను అగ్ని దహించి వేస్తూ వేగంగా వస్తుండటంతో గ్రామస్తులు భయాందోళనలు చెందారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఆకివీడు నుంచి అగ్నిమాపక అధికారి వై. నాగేశ్వరరావు తన సిబ్బందితో సుమారు 3 గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఫైర్ ఇంజిన్ రావడం కొద్దిగా ఆలస్యమైతే పెద్ద ప్రమాదమే జరిగేదని అగ్నిమాపక సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

డీఎన్నార్‌లో ఆన్‌లైన్ హెల్ప్ లైన్ సెంటర్

సాక్షి, భీమవరం: స్థానిక డీఎన్నార్ కళాశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి విద్యార్థులు డిగ్రీ కోర్సుల్లో ఆన్‌లైన్ ప్రవేశం పొందడానికి హెల్ప్‌లైన్ సెంటర్‌ను కళాశాలలో కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం డిగ్రీ కోర్సులలో ప్రవేశం ఆన్‌లైన్ ద్వారానే జరగాల్సి ఉన్నందున దానికి అవసరమైన పూర్తి సదుపాయాలు కళాశాలలో కల్పించామని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), ప్రిన్సిపాల్ బీఎస్ శాంత కుమారి పాల్గొన్నారు.

ఊపందుకుంటున్న ఉపాధి పనులు

- గ్రామీణ పేదలకు ఈ వేసవిలో 75 రోజుల్లోనే 10.32 కోట్లు
- నియోజకవర్గంలో 4.9 లక్షల కుటుంబాలకు ప్రయోజనం అందులో ఎక్కువ శాతం ఎస్సీ ఎస్టీలే


పాలకోడేరులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు


వేంద్రలో కూలీలకు ఏర్పాటు చేసిన టెంట్లు

పాలకోడేరు: వ్యవసాయాధారిత దేశంలో ప్రధానంగా మన రాష్ట్రంలో కూలి పనులపై ఆధారపడి జీవించే వారు ఎక్కువ. స్థానికంగా పనులు లేక సుదూర ప్రాంతాలైన ఇతర రాష్ట్రాలకు ఉపాధి కోసం వలస వెళ్లేవారు..దాంతో సరైన సౌకర్యాలు లేక, అనారోగ్యం వస్తే వైద్యులు అందుబాటులో లేక మృత్యువాత పడేవారు. మరో వైపు వారి పిల్లలు చదువు లేక నిరక్షరాస్యతతో కొట్టు మిట్టాడే వారు. ఇలాంటి వలసలను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అమలు చేయాలని తలపెట్టింది. దీన్ని అవకాశంగా తీసుకుని మన రాష్ట్ర ప్రభుత్వం స్థానికంగా ఉన్న చోటనే పని కల్పిస్తూ, ఉపాధి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోంది. పశ్చిమగోదావరి జిల్లా విషయానికి వస్తే, జిల్లా అధికారులు సమన్వయంతో, ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు మారుతున్న వాతావరణానికి అనుగుణంగా పని వేళలు మార్పు చేస్తూ కూలీలకు ఉపాధి కల్పిస్తున్నారు..పని చేసే చోట కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తూ ప్రోత్సాహాన్ని అందిస్తున్నారని పలువురు కూలీలు తెలిపారు. ఇటీవల వేసవి ఎండలు బాగా ఎక్కువగా ఉండటంతో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 11గంటల వరకు విరామం ఇచ్చి, ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే పనులు చేయిస్తూ, లక్ష్యానికి అనుగుణంగా పనిదినాలు కల్పిస్తూ, విప్లవాత్మకమైన మార్పులు తీసుకు వచ్చారు.ఉండి నియోజకవర్గంలో ఇప్పుడు రోజూ 8వేల నుంచి 9వేల మంది ఈ పనులకు హాజరవుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి జూన్ 15వ తేదీ వరకు 75 రోజుల్లో నియోజకవర్గంలోని ఉండి, పాలకోడేరు, కాళ్ల, ఆకివీడు మండలాల గ్రామీణ ప్రాంతాల్లో 4,09,874 పేద కుటుంబాలు ఈ పనులు చేసుకుని రూ.10,32,88,248 లబ్ధి పొందినట్లు అధికారులు తెలిపారు. ఈ పనులకు హాజరయ్యే వారికి ఒక్కొక్కరికి రోజుకి సరాసరిన రు 252 చెప్పునా గిట్టుబాటు అవుతుందని, పనులకు హాజరయ్యే వారిలో 60 శాతం వరకు మహిళలు ఉంటున్నారని అధికారులు తెలిపారు. వేసవి ఎండలు దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఉపాధి పనులకు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 11వరకు అనంతరం విరామం కల్పించి ఎండ తీవ్రత తక్కువగా ఉండే సాయంత్రం వేళల్లోనే ఈ పనులను చేయిస్తుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సూచనలు మేరకు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి అన్ని మండలాల ఎంపీడీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లు, టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ ఈ వేసవిలో పేదలకు పనులు కల్పన కార్యక్రమాలను సమీక్షిస్తున్నారు.

- ఇప్పటివరకు 2.8 ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు లబ్ధి

ఈ వేసవిలో ఇప్పటివరకు నియోజకవర్గంలో మొత్తం 2.8 లక్షల ఎస్సీ ఎస్టీ గ్రామీణ ప్రాంత కుటుంబాలు ఉపాధి హామీపథకం పనులు చేసుకుని లబ్ధి పొందినట్లు అధికారులు తెలిపారు. గత నాలుగు సంవత్సరాల మాదిరే గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు ఉండని వేసవికాలంలోనూ ఉపాధి హామీ పథకం ద్వారా పేదల పనులు కల్పనలో ఈ ఏడాది కూడా జిల్లా ముందు వరుసలో ఉందని అధికారులు చెబుతున్నారు. వంద రోజులు పని కల్పించాలని లక్ష్యం

వంద రోజులు పని



ఉపాధి హామీ పథకంలో కూలీలందరికీ వంద రోజులు పని కల్పించే విధంగా చర్యలు తీసుకున్నాం. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. వేసవిలో కూలీలకు టెంట్లు ఏర్పాటు చేసి మజ్జిగ ఇచ్చే ఏర్పాట్లు కూడా తీసుకున్నాం

–ఎంపీడీఓ నూకల మురళి గంగాధర్ రావు

వేసవిలో రోజూ పనులు కల్పిస్తున్నారు



వేసకాలంలో పనులు లేని సమయంలో ఆసరా కల్పిస్తున్నారు. వచ్చిన కూలి డబ్బులు మా కుటుంబాలకు ఎంతో ఆసరాగా నిలుస్తున్నాయి. గత ప్రభుత్వంలో కొన్ని రోజులు మాత్రమే పనులు కల్పించేవారు ఇప్పుడా పరిస్థితి లేదు.

–పందిరి పేతురు వేంద్ర

వేరే ప్రాంతానికి వెళ్లి పనులు చేసుకోవాల్సి వచ్చేది



గతంలో వేసవి వచ్చిందంటే పనులు లేక సుదూర ప్రాంతాలు వెళ్లేవాళ్లం. ప్రస్తుతం గ్రామాల్లోనే పనులు కల్పిస్తున్నారు. పనుల్లో ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

–నేలపాటి లక్ష్మణరావు, వేంద్ర

భీమవరం సబ్ జైలు తనిఖీ

సాక్షి, భీమవరం: పట్టణంలోని ప్రత్యేక కారాగారాన్ని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.పవన్‌కుమార్ శనివారం తనిఖీ చేశారు. ముందుగా జైలులోని కిచెన్ రూమ్, కూరగాయలు, జైల్ ప్రాంగణాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్జి పవన్‌కుమార్ మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేని ఖైదీలు మండల న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చునన్నారు. ముద్దాయిలు క్రమశిక్షణ, పరివర్తన, బాధ్యతతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఎస్.సుధీర్, ప్యానల్ లాయర్ పి.అంబేడ్కర్, కాశేశ్వర, జైలు పర్యవేక్షణాధికారి డి.వెంకటగిరి పాల్గొన్నారు.

అమ్మవార్ల ఆషాడమాస జాతర

వీరవాసరం: మండలంలోని రాయికుదురులోని శ్రీ మావుళ్ళమ్మ , శ్రీ మహాలక్ష్మమ్మ ,శ్రీ పోతురాజు స్వామి వార్ల ఆషాడమాస జాతర మహోత్సవం శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. మేళతాళాలతో, బాణసంచా కాల్పుల మధ్య అమ్మవార్ల గరగోత్సవం కన్నుల పండువగా సాగింది. కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డం భారతి, దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ మంతెన వరప్రసాద్, ఆలయ ఈఓ పులగం వేణుగోపాలరావు, బొళ్ల నాగేంద్ర కుమార్, ఏలూరి బాల వెంకట్రావు, గెడ్డం భాస్కరరావు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

పాలకోడేరు: మోగల్లు ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ పై ఇంజనీరింగ్ కన్సల్టెంట్ (ఈసీ) శ్రీనివాస్ శుక్రవారం విచారణ చేశారు. గ్రామంలో ఉపాధి హామీ పథకంలో పనికి రాని వ్యక్తులకు మస్టర్లు వేసి వారి బ్యాంకు ఖాతాలో నగదు జమ అయ్యేలా అక్రమాలకు పాల్పడుతున్న ఫీల్డ్ అసిస్టెంట్ అనిశెట్టి దుర్గాప్రసాద్‌పై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని స్థానికులు ఫిర్యాదు చేయడంతో విచారణ చేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఎంపీడీవో మురళి గంగాధరరావు దృష్టికి తీసుకెళ్లామని ఆయన ఆదేశాలతో తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

విద్య ద్వారానే సమాజం అభివృద్ధి


రాయకుదురులో విద్యార్థులకు పురస్కారాలు అందిస్తున్న దృశ్యం


చెరుకువాడలో విద్యార్థులను సత్కరిస్తున్న నాయకులు


బొండాడలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

వీరవాసరం: విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం కృషి చేస్తున్నారని రాయకుదురు గ్రామ సర్పంచ్ గెడ్డం భారతి తెలిపారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా శనివారం రాయకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతిభావంతులైన విద్యార్థులకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాడు –నేడు పేరుతో పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశామన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభావంతులైన విద్యార్థిని విద్యార్థులకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను, నగదును అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు, విద్యా కమిటీ చైర్మన్ గుబ్బల సత్యనారాయణ, కాయలు వీరస్వామి, గెడ్డం రత్నం రాజు, గెడ్డం మునలయ్య, కడలి ఈశ్వరి, అంగర వేణు, కేవీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగం అభివృద్ధికి విశేష కృషి

కాళ్ల: గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విద్యకు ప్రత్యేక స్థానం ఇచ్చిరని ఉండి ఏఎంసీ చైర్మన్ మన్నే నాగరాజు తెలిపారు. మండలంలో పలు జిల్లా పరిషత్ హైస్కూల్లో శనివారం జగన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానంగా బొండాడ, కోపల్లే, జువ్వలపాలెంలో గ్రామాల్లో పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వైఎస్సార్ సీపీ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక పంపిణీ

ఉండి: ప్రభుత్వ బడులను బలోపేతం చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జడ్పీటీసీ రణస్తుల కనకదుర్గ అన్నారు.శనివారం చెరుకువాడ జడ్పీ హైస్కూల్‌లో గ్రామ సర్పంచ్ కొండవేటి సాంబశివరావు ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో స్కూల్ పరిధిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులు విజయదుర్గా, డీ సంధ్యారాణీ, జీ హర్షితలను సత్కరించి వారికి ఎంపీపీ, జడ్పీటీసీ చేతుల మీదుగా రూ.3 వేలు,రూ.2 వేలు,రూ.వెయ్యి చొప్పున వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చిగురుపాటి కృష్ణాఫర్,రాయి సతీష్,పేరెంట్స్ కమిటీ ప్రతినిధులు,హెచ్ఎం జీవీఆర్ కృష్ణంరాజు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

24 నుంచి జగనన్న సురక్ష


ఉండి: ఈ నెల 24వ తేదీ నుంచి మండలంలోని ప్రతీ గ్రామంలోను జగనన్న సురక్ష బృందాలు పర్యటిస్తాయని ఎంపీడీవో ఏవీ అప్పారావు తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమం అమలు, తీరుతెన్నులపై గ్రామ పంచాయతీ అధికారులకు అవగాహనా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేయబడిందే జనన్న సురక్ష కార్యక్రమం అని తెలిపారు. దీనిలో భాగంగా మండల వ్యాప్తంగా రెండు బృందాలు ఆయా గ్రామాల్లో పర్యటిస్తాయన్నారు. పర్యటించే సమయంలో ప్రజలు చెప్పే సమస్యలపై ఆరా తీసి వెంటనే పరిష్కరిస్తారన్నారు. అలాగే సంక్షేమ పథకాలు అందని అర్హులైన ఎవరైనా ఉంటే వారికి సంక్షేమ పథకాలు అందించేలా చర్యలు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ తహసీల్దార్ ఎస్‌వీఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సొంత ఇంటికి తొందర పడండి!


చినకాపవరంలో లబ్ధిదారులతో ఎంపీడీఓ కందుల వాణి

ఆకివీడు: ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు తమ కలను నెరవేర్చుకేనే సమయం వచ్చినప్పటికీ ముందుకు రాకపోవడం దురదృష్టకరమని ఎంపీడీఓ కందుల వాణి అన్నారు. మండలంలోని చినకాపవరం గ్రామంలోని 32 మంది లబ్ధిదారుల లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణంపై అవగాహనా కార్యక్రమం శనివారం జరిగింది. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని సదుపాయాలూ కల్పించిందని, సొంత ఇంటి కల నెరవేర్చుకునే బాధ్యత మీపైనే ఉందని చెప్పారు. తొందరపడి ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. స్థోమత ఉన్నవారు నిర్మాణ పనుల్ని త్వరితగతిని పూర్తి చేయాలన్నారు. కాంట్రాక్టర్ ద్వారా ఇళ్లు నిర్మించుకునేవారు తమ పేర్లను తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వం ఇచ్చే రూ. 1.80 లక్షలతో పాటు డ్వాక్రా రుణ సదుపాయం ఉందన్నారు. రూ. 3 లక్షలతో కాంట్రాక్టర్ ఇల్లు నిర్మించి ఇస్తారని చెప్పారు. ఎంపీడీఓ వాణి సూచనలకు స్పందించిన లబ్ధిదారులు 20 మంది ముందుకు వచ్చి ఇళ్లు నిర్మించుకుంటామని హామి ఇచ్చారు. వెంటనే ఇల్లు నిర్మించుకునేందుకు భూమి పూజ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ శివ రామరాజు, తహసీల్దార్ ఎస్.బీ.వీ.లక్ష్మీ, హౌసింగ్ ఏఈ భాస్కర రాజు, వైసీపీ నాయకుడు నాతిరెడ్డి అన్నవరం, నందమూరి సత్యవతి, కార్యదర్శి నారాయణరావు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి స్థల పరిశీలన


రహదారి నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

ఉండి: మండలంలోని పెదపేటకు సమీపంలోని లేఅవుట్‌కు వెళ్లేందుకు నూతన రహదారి నిర్మాణం కొరకు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు శనివారం స్థల పరిశీలన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఉండి సంత మార్కెట్ నుంచి జగనన్న లేఅవుట్‌కు వెళ్లేందుకు రహదారి ఉన్నా మరింత సౌకర్యంగా ఉండేందుకుగాను ఉండి పశువుల ఆసుపత్రి వద్ద నుంచి అనుకూలతను బట్టి మరో రహదారి నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. లబ్ధిదారుల సౌకర్యార్థం ఇప్పటికే మంచి రహదారి నిర్మాణం చేసామని ఆ రహదారి కొంత దూరం ఎక్కువ కావడంతో మరింత సౌలభ్యత కొరకు మరొక రహదారి నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలోనే రహదారి నిర్మాణం కొరకు కార్యాచరణ చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రణస్తుల కనకదుర్గ, మహంకాళి, ఉపసర్పంచ్ గొట్టుముక్కల కళ్యాణ్ వర్మ, గ్రామపార్టీ అధ్యక్షుడు కరిమెరక మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు కరిమెరక చంద్రరావు, బ్యాంక్ డైరెక్టర్ కరిమెరక శివనాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు బడుగు బాలాజీ, మల్లువలస సత్యనారాయణ, అంగర సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి సమస్యలు గుర్తించాలి


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీవో దాసి రాజు

భీమవరం అర్బన్: జగనన్న సురక్ష కార్యక్రమం ఈ నెల 24 నుంచి జరుగుతుందని అధికారులు, కార్యదర్శులు, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి సమస్యలు గుర్తించాలని ఆర్డీఓ దాసి రాజు అన్నారు. భీమవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఈ నెల 24 నుంచి జరగబోయే జగనన్న సురక్ష కార్యక్రమంపై వివిధ శాఖల అధికారులకు, కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో దాసి రాజు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ఈ నెల 24 ప్రారంభమై నెల రోజులు పాటు జూలై 24న ముగుస్తుందన్నారు. మండలంలో గ్రామాల్లో ఎంపీడీఓ వెంకటలక్ష్మి, తహసీల్దార్ వై. రవికుమార్‌ల పర్యవేక్షణలో రెండు బృందాలుగా అధికారులు, కార్యదర్శులు, వలంటీర్లు సమిష్టిగా ఇంటింటికి వెళ్లి బర్త్, డెత్, ఇన్‌కమ్, కుల ధ్రువీకరణ తదితర సమస్యలు ఉంటే గుర్తించి వెంటనే పరిష్కారం దిశగా కృషి చేయాలన్నారు. అనంతరం పలు అంశాలపై అవగాహన కార్యక్రమంలో చర్చించారు.

ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభించండి

ఉండి: మండల వ్యాప్తంగా ఓటరు నమోదు ప్రక్రియను ప్రారంభించాలని మండల ప్రత్యేకాధికారి ఎం రవికుమార్ తెలిపారు. శనివారం ఉండిలో పంచాయతీ, రెవెన్యూ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఓటరు నమోదు ప్రక్రియపై ఇంటింటికీ సర్వే నిర్వహించాలన్నారు. ఈ సర్వే ద్వారా గ్రామం నుంచి శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు, దేశాలకు వెళ్లిపోయిన వారిని, వివాహమై వెళ్లిపోయిన యువతులను గుర్తించి వారిని ఓటరు జాబితా నుంచి తొలగించాలన్నారు. అర్హులైన వారిని తప్పకుండా కొత్త ఓటర్లుగా నమోదు చేయాలని తెలిపారు.

20న సీజ్ చేసిన వాహనాల వేలం

సాక్షి, భీమవరం: ఎక్సైజ్ నేరాల్లో సీజ్ చేసిన వాహనాలను ఈనెల 20న వేలం నిర్వహిస్తున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ వీవీవీఎస్ఎన్ వర్మ శనివారం చెప్పారు. వేర్వేరు ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన రెండు ద్విచక్ర వాహనాలను భీమవరం సెబ్ కార్యాలయం ఆవరణ వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనే వారు విధిగా రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. అలాగే ఆధార్ కార్డు జిరాక్స్ వెంట తెచ్చుకోవాలని సూచించారు. పాటదారులు పాడుకున్న మొత్తానికి అదనంగా 18 శాతం జీఎస్టీ చెల్లించాలని వర్మ స్పష్టం చేశారు.


27న గుంటూరులో ఏఐవైఎఫ్ యువజన సమ్మేళనం

సాక్షి, భీమవరం: రాష్ట్ర యువజన విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక సమ్మేళనం ఈనెల 27వ తేది నుంచి నాలుగురోజులపాటు గుంటూరులో నిర్వహిస్తున్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు చెప్పారు. భీమవరంలో శనివారం నిర్వహించిన అఖిలభారత యువజన సమాఖ్య జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుంటూరులో నిర్వహించే యువజన సమ్మేళనంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల యువజన నిరంకుశ వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కొడవర్తి రమేష్, కోనాల భీమారావు, సుందర్, టి.అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

భీమవరం అర్బన్: ఈ ఏడాది సార్వా సాగుకు సంబంధించి కౌలు రైతులు కౌలు రైతు గుర్తింపు కార్డు (సీసీఎల్‌సీ)లకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ తెలిపారు. భీమవరంలోని వ్యవసాయ కార్యాలయంలో శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. సీసీఎల్‌సీ కార్డులకు దరఖాస్తు చేసుకునే కౌలు రైతులు వ్యవసాయ కార్యాలయంలోని సిబ్బందిని సంప్రదించాలన్నారు. సీసీఎల్‌సీ కార్డులు వల్ల ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ విత్తనాలు, పంటల బీమా, ధాన్యం విక్రయం తదితర ప్రభుత్వ ఇచ్చే వివిధ పథకాలను పొంది ప్రయోజనం పొందవచ్చన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుపై అభినందనలు


సర్పంచ్ శ్రీనివాస్‌ను, విద్యుత్ సిబ్బందిని అభినందిస్తున్న దృశ్యం

పాలకోడేరు: మండలంలోని విస్సాకోడేరులో కరెంట్ కష్టాలను అధిగమిస్తూ పెద్ద ఎత్తున 163 కెవి, 100 కెవి, 63 కెవి, ట్రాన్స్ఫార్మర్లు 2 , 40 కెవి ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినందుకు సర్పంచ్ బొల్లా శ్రీనివాస్‌ను, విద్యుత్ అధికారులను సన్మానిస్తూ గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ ఏఈ, ఎల్ఐలు మాట్లాడుతూ మరి కొద్ది రోజుల్లో సుమారు 6 కిలోమీటర్ల మేర కండక్టర్ ఏర్పాటు చేస్తామని వంకాయల పాలెం, కొత్తపాలెంలో కూడా మరో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామని, విస్సా కోడేరు అన్ని ఏరియాల్లో ఎక్కడ నోవోల్టేజ్ సమస్య లేకుండా పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని తెలిపారు. అదేవిధంగా పెద్ద పేట నందు ఎప్పటి నుంచో లో వోల్టేజ్ సమస్య తీర్చినందుకు పెదపేట వాసులు హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్ శ్రీనివాస్, విద్యుత్ అధికారులకు అభినందనలు తెలిపారు.